
ఓం నమో భగవతే శ్రీ రమణయ



# రమణ భాస్కర



సంపుటి : 9 సంచిక : 9 పుష్పం : 18-19 20-01-2004

RAMANA BHASKARA

*TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE*

PAGES : 16

VOL : 9 ISSUE : 9

EDITOR
*P.S. RAMA RAJU*

EDITING
*P.H.V. SATYAVATHI*
(HYMA)

SUBSCRIPTION
Yearly : Rs. 150/-
Each Copy : Rs. 8/-

ADDRESS
RAMANA BHASKARA
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 224589, 224689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 222438, 221260
94401-31188

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 18-12-2003. జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సంసారం అనేది కూడా ఒక పెద్దరోగము. ఈరోగానికి వైద్యము చేసేవాడే భగవంతుడు. ఓం వైద్యాయనమః. భగవంతుడు కూడ ఒక వైద్యుడు, సంసారరోగానికి ఆయనేవైద్యం చేయగలడు కాని ఈ భౌతికమైన డాక్టర్లు ఆరోగానికి వైద్యం చేయలేరు. సంసారం అంటే ఇంట్లో మనషులుకాదు. శరీరం చనిపోతుంది, తిరిగిపుడుతుంది ఈ చనిపోవటం, పుట్టటమే సంసారం. భౌతికంగా వచ్చే రోగాలు ఇక్కడ తగ్గకపోతే వైద్యం కోసం కాకినాడ వెళతాము, అక్కడ తగ్గకపోతే హైదరాబాద్ వెళతాము లేకపోతే అమెరికా వెళతాము. కాని సంసారరోగంలోనుండి బయటపడాలంటే అక్కడక్కడ తిరిగితే కుదరదు, నీవు భగవంతుడిని ఆశ్రయించవలసిందే, యింకొక ఉపాయం లేనేలేదు. సంసారరోగం నుండి విడుదలపొందాలంటే నీవు భగవంతుని భజించవలసిందే, ఆయనను ప్రేమించవలసిందే, ఆయన నామాన్ని స్మరించవలసిందే, ఆయన అనుగ్రహాన్ని పొందవలసిందే. మేము ఆ కర్మ చేసాము, ఈ కర్మచేసాము, అలాగ చేసాము, ఇలాగ చేసాము మరి ఎలాగండి అంటే ఈ కర్మలకంటే భగవంతుని దయగొప్పది. మేము వాళ్ళను తిట్టాము, వీళ్ళను కొట్టాము మాకు మోక్షం ఎలా వస్తుంది అని అనుకోవద్దు భగవంతుడిని ఆశ్రయించండి. ఆయన వైద్యుడు, ఆయనే ఈ సంసార రోగం నుండి మిమ్మల్ని బయటకు తీసుకొని వస్తాడు. ఈ సంసారం అనే రోగానికి భగవంతుడు అనే డాక్టరే వైద్యం చేయాలి, అందుచేత భగవంతుడిని ఆశ్రయించండి, ఆయన పాదాలను విడిచిపెట్టవద్దు, భగవంతుడు చెప్పిన మాటలకు

ఈ సంచికలో......

సద్గురు శ్రీ నాన్నగారి అనుగప్రాభాషణములు

18-12-2003 జిన్నూరు ........ 1
20-12-2003 భీమవరం ........ 9



Visit us @ www.srinannagaru.com

విరుద్ధంగా నీకు ఏదైనా తలంపులు వస్తూ ఉంటే ఇదికాదు, ఇదికాదు, భగవంతుడు ఇలా చెప్పలేదు, భగవంతుడు చెప్పినదే మనం వినాలి అని అనుకొంటూ దానికి విరుద్ధంగా వచ్చే తలంపులను గెంటుకొంటూ వెళితేనే భగవంతుడి మాటమీద మనకు విశ్వాసం కలుగుతుంది. జననమరణ చక్రం నుండి, అజ్ఞానం అనే రోగంలోనుండి విడుదలచేయగల సమర్థుడు ఈశ్వరుడు మాత్రమే, మనం తెలుసుకోదగినవాడు ఆయన మాత్రమే. కోటివిద్యలు కూటి కోసమే అనే సామెత ఉంది. మనం మెడిసిన్ చదివినా, ఇంజనీరింగ్ చదివినా, లా చదివిన, ఏపని నేర్చుకొన్నా ఇవిఅన్నీ కూటికి తప్పించి భగవంతుడిని తెలుసుకోవటానికి పనికిరావు. భగవంతుడిని తెలుసుకొనే విద్య ఒక్కటే, అదే ఆత్మవిద్య, ఆ విద్యనే నేను అని భగవంతుడు చెప్పాడు. మనకు ఒక శరీరం ఉంది, అది మనదే కాని అది మన స్వరూపంకాదు, మనకు ఆలోచించే మనస్సు ఉంది కాని అది మన స్వరూపంకాదు, నిర్ణయించే బుద్ధి మనకు ఉంది కాని అది మన స్వరూపంకాదు. మనకు స్నేహితులు, బంధువులు ఉన్నారుకాని వారు మన స్వరూపంకాదు. మన స్వరూపం ఎవరు అంటే భగవంతుడే మన స్వరూపం. ఆయనను తెలుసుకొనేవరకు అజ్ఞానం మనలను విడిచిపెట్టదు. తెలుసుకోదగినది అంటూ ఈ లోకంలో ఏదైనా ఉంటే భగవంతుడు ఒక్కడే. మరి ఆయనను తెలుసుకోవాలంటే ఎక్కడికి వెళ్ళాలి? ఏమి చేయాలి? చెట్లు చుట్టూ తిరగాలా, పుట్టల చుట్టూ తిరగాలా అంటే అలాకాదు ఆయన చెప్పిన మాటలను శ్రద్ధగా విని వాటిని మననం చేసుకొంటూ, ఆ మాటల యందు గౌరవం కలిగిఉండి, వాటిని అనుభవంలోనికి తెచ్చుకొంటే ఆయన స్వరూపం మనకు తెలుస్తుంది. కాని మనం ఆయన చెప్పిన మాటలు వినటం మానేసి చెట్లుచుట్టూ తిరగటం నేర్చుకొన్నాము. ఆత్మను తెలుసుకోవటానికి ఎక్కడెక్కడికోపోతున్నావు, అక్కడ ఉందా అది నీకు దొరకటానికి? నీవు వెదికే వస్తువు నీ హృదయంలోనే ఉంది. ముందు నీ మనస్సును ఏకాగ్రం చేసుకో, నిర్మలం చేసుకో, పవిత్రం చేసుకో, అప్పుడు వెదికితే అది నీ హృదయంలోనే దొరకుతుంది వస్తువుఎక్కడ ఉందో చెప్పకుండా, దానిని ఎలా వెదకాలో చెప్పకుండా, మనస్సు ఎటువంటిదో దానిని ఎలా శోధించాలో చెప్పకుండా ఏదో విషయాలు గురించి చెపుతూ ఉంటే అవి అనవసరప్రసంగాలు వాటివలన ప్రయోజనంలేదు అని జీబ్రాన్ అనే ముస్లిమ్ కవి చెప్పాడు. నీ హృదయంలో ఏది ఉందో దాని గురించి చెప్పటం మానేసి రోడ్డుమీద ఉన్న దుమ్ము అంతానోల్లుకొని వచ్చి చెపుతూ కాలాన్ని చంపటం కోసం ప్రసంగాలు చేస్తూ ఉంటే అవి అనవసర ప్రసంగాలు, నీవు బాగుపడటానికి అవి ఉపయోగపడవు. ప్రతీమనిషి వాడిలో ఉన్న లోపాలను వెతకటం మానేసి. ఇతరులలోని లోపాలను వెతుకుతూ ఉంటాడు ఇదే ప్రతీ మనిషిలో ఉన్న గొప్పలోపం అని జీబ్రాన్ చెప్పాడు. మనోమూలంలోనే భగవంతుడు ఉన్నాడు, అయితే మనస్సు లోపలకు వెళ్ళదు. మనస్సు సూక్ష్మం అవ్వాలి, నిర్మలం అవ్వాలి, మనస్సు పవిత్రం అవ్వాలి, మనస్సుకు ఏకాగ్రత రావాలి అప్పుడు గాని దానికి లోచూపురాదు. లోచూపు వస్తేనేగాని అది లోపలకు ప్రయాణం చెయ్యలేదు. అది లోపలకు ప్రయాణం



చేస్తేనే గాని దానిమూలంలో ఉన్న ఆత్మలో లీనంకాలేదు. ఇదంతా వదిలేసి, నీ మనస్సును నియమించుకోవటం వదిలేసి, నీ మనస్సును నిగ్రహించుకోవటం మానివేసి ఎక్కడికో తిరుగుతావు ఎందుకురా, చెప్పేవారు ఎలా చెపుతున్నారు, తిరిగేవాడివి నువ్వు ఎలా తిరుగుతున్నావురా అంటున్నారు జీబ్రాన్, అంటే చెప్పేవాడికి బుద్ధిలేకపోతే నీకయినా బుద్ధిలేదా అది ఆయన అడిగేది. దేహం అనేది దేశకాలాలకు లోబడి ఉంటుంది. ఇప్పుడు ఈ దేహం ఉంది, కొంతకాలం తరువాత అది చనిపోతుంది. ఉన్నంతకాలం ఏదో ప్రాంతంలో తిరుగుతూ ఉంటుంది. అంటే దేహం దేశకాలాలకు లోబడి ఉంటుంది. కాని నీలోపలఉన్న సత్యం దేశకాలాలకు లోబడి ఉండదు. దేశకాలాలకు లోబడినటువంటి ఈదేహాన్ని, ఇంద్రియాలను, మనస్సును, బుద్ధినీ అన్నీ ఉపయోగించుకొని, శాస్త్రాన్ని ఉపయోగించుకొని దేశకాలాలకు అతీతంగా ఉన్న సత్యవస్తువును తెలుసుకో, ఈ దేహం భూమి మీదకు వచ్చినపనిఅదే, నువ్వు వచ్చిన పని మర్చిపోవద్దు. నీవు తెలుసుకోదగినది భగవంతుడు ఒక్కడే, ఒక వేళ అదికాకుండా మిగతావి ఎన్ని తెలుసుకొన్నా అవి స్వప్న సమానము. నిద్రలో మనకు స్వప్నం వస్తుంది. స్వప్నంలో ఎంతోమంది మనుషులు కనిపిస్తారు, ఎన్నో సంఘటనలు జరుగుతాయి. సంతోషకరమైన సంఘటనలు వచ్చినప్పుడు సంతోషిస్తాము, దుఃఖకరమైన సంఘటనలు వచ్చినప్పుడు దుఃఖపడతాము. ఇంతకీ ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటి అంటే నీకు మెలుకువ వచ్చాక ఏమి అనిపిస్తుంది? ఆ సంతోషం అబద్దం, ఆ దుఃఖం అబద్దం అని నీకు మెలుకువ వచ్చాక అనిపిస్తుంది. స్వప్నంలో జరిగే సంఘటనలు అన్నీ ఎంత అసత్యమో జాగ్రదవస్థలో జరిగే సంఘటనలు అన్నీ కూడా అంతే అసత్యం. అందుచేత జాగ్రదవస్థను కూడా స్వప్నం కింద చూడటం నేర్చుకోండి, ఇదికూడా సాధనలో ఒక భాగము. జాగ్రదవస్థ కూడా స్వప్నమే. ఆ స్వప్నానికి, ఈ స్వప్నానికి తేడా ఏమిటి అంటే అదిపొట్టిగా ఉంటుంది, ఇది పొడుగ్గా ఉంటుంది అంతే తేడా గాని అది ఎంత అసత్యమో ఇది కూడా అంతే అసత్యం. రాత్రి స్వప్నంలో నీకు మంచి జరగవచ్చు, చెడు జరగవచ్చు. మంచి జరిగితే సంతోషిస్తావు, చెడు జరిగితే దుఃఖపడతావు. స్వప్నంలో ఇవి అన్నీ జరుగుతూ ఉంటాయి. అలాగే జాగ్రదవస్థలో కూడా నీకు లాభం వస్తుంది, నష్టం వస్తుంది, జయాపజయాలు వస్తూ ఉంటాయి, గౌరవాలు



వస్తాయి, అగౌరవాలు వస్తూ ఉంటాయి. వీటినిచూసి నీవు కంగారు పడవద్దు. రాత్రి నీకు స్వప్నంలో వచ్చిన సంఘటనలు ఎటువంటివో ఇవికూడా అంతే, వీటిని కూడా స్వప్నంకింద చూడటం నేర్చుకో, అలాగే ప్రాక్టీసు చెయ్యి, అప్పుడు నీ మనస్సు వెళ్ళి గూటిలో పడిపోతుంది. ఇప్పుడు మనకు బంధువులు స్నేహితులు, విరోధులు ఇలా రకరకాల మనుషులు ఉన్నారు, స్వప్నంలో కూడా మనకు రకరకాల మనుషులు, కనిపిస్తున్నారు. వీరు కూడా అంతే ఆ విషయం లోపల పెట్టుకొని, ఆనిదానం పెట్టుకొని నీపని ఏదో నీవు చేసుకొంటూ వెళ్ళు, అప్పుడు నిన్ను ఏదీ బంధించదు, మమకారం కూడా తగ్గుతుంది. మానవుడికి దుఃఖానికి మమకారమే కారణం. శాస్త్రంలో ఒక మాట ఉంది. ఒక చెట్టు ఉంది అనుకో, దానికి ఆకులు, పూవులు పళ్ళు ఉన్నాయి అనుకో, ఆచెట్టును భూమిలోనుండి పెకళించి తీసివేసావు అనుకో ఆకులు, పూవులు, పళ్ళు ఇవిఅన్నీ కూడా ఎండిపోతాయి. అలాగే ఒక్క మమకారాన్ని నీవు తగ్గించుకొంటే భూమిలో నుండి తీసివేసిన చెట్టు ఏవిధంగా అయితే ఎండిపోతుందో అలాగ సంసారవృక్షం ఎండిపోతుంది, పునర్జన్మ కారణాలు అన్ని నశిస్తాయి అని చెప్పారు. ధర్మంగా మనపని మనం చేసుకొంటూ వెళ్ళాలి అంతేగాని మమకారం పెట్టుకొంటే వారూ పాడవుతారు, మనమూ పాడవుతాము. చెట్టుకు నేల ఏవిధంగా అయితే శక్తిని ఇస్తోందో అదే విధంగా ఈ సంసారానికి విలువ లేకపోయినా సంసారం మీద నీకు ఉన్న మమకారం కొలదీ దానికి విలువ ఉందని నీకు అనిపిస్తోంది. ఒక్కమాట మీరు దృష్టిలో పెట్టుకోండి, మీరు ఎట్టిపరిస్థితులలో ఉద్రేకపడవద్దు. మీరు కూల్‌గా ఉండండి, నేచురల్‌గా ఉండండి, కామ్‌గా ఉండండి. మీరు నార్మల్‌గా, నేచురల్‌గా ఉంటే మీ చైతన్యస్థాయి పెరుగుతుంది. మనం శబ్దాన్ని జయించాలి. కొంతమంది మనలను నిందిస్తూ ఉంటారు, కొంతమంది పొగుడుతూ ఉంటారు. ఆనింద కూడా శబ్దమే, ఆ పొగడ్త కూడా శబ్దమే, ఆ శబ్దాన్ని మనం అతిక్రమించాలి, ఆ శబ్దాన్ని జయించకుండా మన మనస్సు దాని గూటిలోనికి వెళ్ళదు.

మన మొదటి రాష్ట్రపతి బాబూరాజేంద్రప్రసాద్, ఆయన పరమపవిత్రుడు, భక్తుడు. మనం దేవుని బొమ్మలను ఎలా పూజిస్తామో అలాగ ఆయన మట్టిని పూజించే వారు, ఏమిటి అని అడిగితే మట్టితో బొమ్మలను చాలామంది తయారుచేస్తున్నారు. కాని ఆ మట్టిని మనిషి తయారుచేయలేదు, భగవంతుడు తయారుచేసాడు. అందుచేత మట్టిని పూజిస్తున్నాను అని చెప్పారు. కొంతమంది మంచిపనిచేసి అది అందరికీ తెలియాలి అనుకొంటారు వాడు లోకానికి పనికివస్తాడు గాని ఆధ్యాత్మికంగా పనికిరాడు. మనం ఏదైనా మంచిపనిచేసి అది అందరికీ తెలియాలి అనుకొన్నా, గౌరవం ఆశించినా దానివలన గౌరవం రావచ్చు కాని ఆధ్యాత్మికంగా సున్నా, మన స్వరూపం మనకు దొరకదు, ఇందులో రాజీలేదు. భగవంతుడు ఉన్నాడు అనే విశ్వాసం లేకుండా, భగవంతుడి మీద ప్రేమలేకుండా మేము జపం చేస్తున్నాము, ధ్యానం చేస్తున్నాము అంటే వారికి ఏమీరాదు. మీరు చేసేది ప్రేమతో, భక్తితో చేస్తున్నారా లేక యాంత్రికంగా చేస్తున్నారా అని భగవంతుడు చూస్తూ ఉంటాడు. లోపల ప్రేమలేకుండా, భక్తిలేకుండా, విశ్వాసంలేకుండా జపధ్యానములు చేసినా వాటివలన

ఈశ్వరుడు మోసపోడు. నీవు మంచిపనులు చేస్తే పుణ్యం వస్తుంది, అది సుఖరూపంలో వస్తుంది అనుభవిస్తే పోతుంది. చెడ్డపనులు చేస్తే ఫలితం దు:ఖరూపంలో వస్తుంది, అనుభవిస్తే అదీపోతుంది, ఇలా పనులు చేయటం, వాటి ఫలితాన్ని అనుభవించటం ఇదే పనా నీకు. నీవు ఏది పొందాలో తెలియకుండా నీకు సాధన ఏమిటి? గమ్యం ఏమిటో తెలియకుండా ఇలా ఎంతకాలం తిరుగుతావు? మాకు మోక్షం ఎప్పుడు వస్తుంది అని కొంతమంది అడుగుతూ ఉంటారు. అది మీరు చేసే సాధనను బట్టి ఉంటుంది. భగవంతుని పట్ల మీకు సజీవమైన విశ్వాసం ఉంటే, ఆయన మాటయందు మీకు గౌరవం ఉంటే, మీరు చేసేపని మీద మీకు శ్రద్ధ ఉంటే మీరు మోక్షం కావాలి అని అడుగనక్కరలేదు, మోక్షమే మీ ఇంటికి వచ్చి మీ తలుపు తడుతుంది. జిన్నూరు నుండి పాలకొల్లు వెళ్ళటానికి ఎంత టైము పడుతుంది అని అడిగితే నడిచివెళ్ళేవాడికి గంటపడుతుంది, సైకిలు మీద వెళితే అరగంట పడుతుంది, కారులో వెళితే పది నిమిషాల్లో వెళ్లిపోతాడు. ఇది ప్రత్యేకంగా చెప్పలేము వాడు ఉపయోగించే వాహనాన్ని బట్టి ఉంటుంది. అలాగే  నీవు చేసే సాధనను బట్టి, నీకు ఉన్న ఏకాగ్రతనుబట్టి, పవిత్రతను బట్టి మోక్షం వస్తుంది. మన బంధువులతోటి, స్నేహితులతోటి, విరోధులతోటి, మనకు ఉన్న అంగబలంతోటి, అర్ధబలంతోటి, మన శరీరంతోటి మనం విడిపోతాము కాని ఏదైతే మన స్వరూపంగా ఉందో దానితోటి మనం విడిపోలేము, తెలుసుకోదగినది అది ఒక్కటి మాత్రమే అదే మనగమ్యం. చుట్టాలు, స్నేహితులు ఇవి అన్నీ అహంకారానికే, ఆత్మకు ఏమీలేదు. ఆ చుట్టాలు నిన్ను పొగుడుతూ ఉంటారు, అది చూసి బోర్లా పడతాము. షేక్సిఫియర్ డ్రామాలో ఒకమాట చెప్పాడు. దేహప్రారబ్ధాన్ని బట్టి నీకు డబ్బు వచ్చింది అనుకో, సమాజంలో గౌరవం వచ్చింది అనుకో చాలామంది స్నేహితులు, చుట్టాలు వచ్చి  నీ చుట్టూ చేరి నిన్ను పొగుడుతూ ఉంటారు. వారు మంచివారు, వారు నిజమైన స్నేహితులు అనుకొంటే నీవు బోర్లాపడతావు అని చెప్పాడు. వారు అందరూ నిన్నుబట్టి చేరలేదు, నీ దగ్గర ఉన్న డబ్బును బట్టి, నీకు ఉన్న గౌరవాన్ని బట్టి నీదగ్గరకు చేరారు. వారందరూ నిజమైన స్నేహితులు అని నీవు అనుకొంటావు అనుకో అది నీ అజ్ఞానానికి గుర్తు అని చెప్పాడు. ఇలా ఎందుకు చెప్పాడు అంటే నీలో ఉన్న ఈ అజ్ఞానం నశించకుండా నీకు జ్ఞానం రాదు. బాహ్యప్రవర్తనను చూసి మీరు ఒక మనిషిని అంచనాకడుతూఉంటే మీరు తెలివితక్కువవారు అని అర్ధం. అసలు ఆ మనిషి యొక్క స్వభావం ఎటువంటిది, అతని మనస్సు ఎలాగ ఉంది అనేదానిని బట్టి మనిషిని అంచనావేయాలి. అంతేగాని ఆ మనిషి బాహ్యంగా చెప్పేమాటలను బట్టి, బాహ్యంగా మనకు కనబడే అతని ప్రవర్తనను బట్టి మనిషిని అంచనావేస్తూ ఉంటే మనం తెలివితక్కువ వారము అనిగుర్తు. జీవుడు బ్రహ్మంలో నుండి వచ్చాడు, వాడు ఎక్కడ నుండి వచ్చాడో అక్కడలయమయ్యేవరకు వాడికి పునర్జన్మలు తప్పవు, రావటాలు, పోవటాలు తప్పవు, ఇలా ప్రయాణాలు చేస్తూనే ఉండాలి. మీ పూర్వజన్మ సంస్కారమును బట్టి మీకు ఇష్టమైన మార్గములో ప్రయాణంచేసి బ్రహ్మానుభవం పొందండి, అప్పటివరకు ఈ సంసారరోగం మిమ్మల్ని విడిచిపెట్టదు. యిందులో నుండి విడుదల పొందాలంటే ఒకే ఒక డాక్టరు ఉన్నాడు, వాడే కేశవుడు, వాడిని ఆశ్రయిస్తేనే కాని మీరు మాయలో నుండి, అజ్ఞానంలో నుండి, మనస్సు పెట్టే క్షోభలో నుండి విడుదల పొందలేరు నాయనా. ఏదైతే మీకు స్వరూపంగా ఉందో అది తప్పించి మిగతాది అంతా స్వప్నసమానము, ఆ స్వప్నసమానము దగ్గర ఆగిపోవద్దు. అక్కడ ఆగిపోతే మీరు గమ్యాన్ని చేరుకోలేరు. మీరు వెంటనే అక్కడకు చేరుకోలేకపోయినా మీ గమ్యం ఏదో ముందు మీకు తెలిసి ఉండాలి. ఓహో ఇదికదా మనం పొందవలసింది అనేటువంటి ఐడియా ముందు మీకు ఉండాలి, ఆ ఐడియా పెట్టుకొని మీరు ప్రయాణం చేయాలి.

అరుణాచలేశ్వరుడు అంటే దేవుడు అనుకొంటున్నాము, ఈ సృష్టికి యజమాని అనుకొంటున్నాము, కర్మఫలదాత అనుకొంటున్నాము. అంతేకాదు ఆయన గురువుకూడా, గురువు చేసే పనికూడా ఆయన చేస్తాడు. ఏ కారణం వలన నాకు ఆత్మజ్ఞానం కలగటం లేదో నీకు తెలుసు అందుచేత నీవు గురువుగా ఉండి, నన్ను గైడ్ చేసి, నాలో ఉన్న పునర్జన్మ హేతువులను నీవే తొలగించాలి. చైతన్యంలోనుండి వచ్చే సుఖం తప్పించి, మీరు ఇంద్రియాలు ద్వారా పొందే సుఖాలు, మీ మనస్సు ఊహించుకోవడం ద్వారా వచ్చే సుఖాలు, విషయాల ద్వారా వచ్చే సుఖాలు అన్నీ కూడా పరిణామంలో దు:ఖాలుగా మారిపోతాయి, అంతేకాదు వాటిని వడ్డీతో సహా నీవు అనుభవించాలి అని భగవంతుడు చెపుతున్నాడు. మనకు పుణ్యబలం లేక భగవంతుడు చెప్పే వాక్యాలు అర్ధంకాకపోవచ్చు. భగవంతుడు చెప్పిన వాక్యం మీద మనకు విశ్వాసం కలుగకపోతే అది మనబుద్ధిలో ఉన్న దోషమే. సద్గతి, దుర్గతి గురించి భగవంతుడు చెప్పాడు. మంచి చేయడం సద్గతి. దానివలన పుణ్యలోకాలు వస్తాయి, చెడుచేయటం దుర్గతి దానివలన పాపలోకాలు వస్తాయి, ఆ అనుభవాలు అయిపోయిన తరువాత తిరిగి ఈ భూమిమీదకు రావలసిందే. ఇవన్నీ టెంపరరీ విషయాలు, వీటిని చూసి ఉద్రేకపడవద్దు. అర్జునా! నీ బ్రెయిన్‌ను బేలెన్స్ చేసుకో, నిర్మలంగా ఉండు, సబ్జక్టును ప్రోపర్‌గా అర్ధంచేసుకో నీవు ఆత్మజ్ఞానం దాకా వెళ్ళనక్కరలేదు, సబ్జక్టును సరిగా అర్ధంచేసుకొంటూ ఉంటే ముందు నీకు టెన్షన్ తగ్గిపోతుంది, దు:ఖం తగ్గిపోతుంది. పనికివచ్చేవాడికి, పనికిరానివాడికి అందరికి కూడా బతకాలి, బతకాలి అని ఉంది, అది మన అజ్ఞానానికి గుర్తు. దేహప్రారబ్ధం ప్రకారం ఆ దేహం ఎంతకాలం ఉండాలో అంతకాలం ఉంటుంది, తరువాత మరణిస్తుంది. దేహము మరణిస్తే దేహగతమైన చరిత్ర ముగుస్తుంది. కాని జీవుడు చరిత్ర ముగియదు. బతకాలి, బతకాలి అని ఎందుకు అనుకోవటం, నేచురల్‌గా ఆ దేహానికి ఎప్పుడోకప్పుడు చావు  వస్తుంది, రానివ్వండి. చనిపోవాలి,చనిపోవాలి అని మనం అనుకోవటంలేదు కదా మరి బతకాలి, బతకాలి అని అనుకోవటం మటుకు ఎందుకు?  ఇలా అనుకోవటం మన అజ్ఞానానికి గుర్తు. సోదరమహాశయులారా, మీరు ఎంత భక్తులయినా, ఎన్నియాత్రలు చేసినా, ఎన్ని పుణ్యకార్యాలు చేసినా, ఎన్ని నదులలో మునిగినా, ఎంత జపం చేసినా, మీరు ఎవరి భక్తులు అయినప్పటికీ దేహమే సర్వస్వం, దేహమే నేను అనే తలంపు ఉన్నంతకాలం మీరు ఎన్ని జన్మలు ఎత్తిన మిమ్మల్ని దు:ఖం

విడిచిపెట్టదు. మీ ఇష్టదేవతను పూజించుకోండి. దానికి అభ్యంతరం లేదు. మిమ్మల్నిఅందరినీ రమణభక్తులను చేయాలని మాకు లేదు, ఇది ఒక పార్టీకాదు. ఉదాహరణకు చెపుతున్నాను. మీరు రమణమహర్షిని విడిచిపెట్టేసి, నన్ను విడిచిపెట్టేసి వెళ్ళిపోతారు అనుకోండి నాకు ఎర్రచీమ కుట్టినట్టు కూడా ఉండదు. రమణభక్తులను పెంచాలి యిటువంటి తలంపులు మాకు లేవు. ఇక్కడ ఎవరో ఒకవ్యక్తి ప్రధానం కాదు, ఒక నామం ప్రధానం కాదు, ఒక రూపం ప్రధానం కాదు, సబ్జక్టు ప్రధానం. నాలో ఏదైనా చెడుతలంపులు ఉంటే, చెడుఅలవాట్లు ఉంటే వాటిలో నుండి విడుదల చెయ్యి అని అరుణాచలేశ్వరుడ్ని ప్రార్థిస్తూ ఇక్కడ భగవాన్ ఒకమాట చెపుతున్నారు. నాలో ఏదైనా కుట్ర ఉంటే దానిలో నుండి విడుదల పొందటానికి నేను ఎంతోకొంత ప్రయత్నం చేయాలి. కాని ఆ ప్రయత్నం ఒక్కటే సరిపోదు అని నాకు తెలుసు. నీ దయ అవసరం అని నాకు తెలుసు.  కేవలము నా ప్రయత్నం వలన నేను అజ్ఞానంలో నుండి విడుదల పొందలేను. అందుచేత ఇదీ అవసరమే, అదీ అవసరమే, నాప్రయత్నం ఉంది అనుకో నీ దయ లేదు అనుకో, నేను  అజ్ఞానంలో నుండి బయటకు రాలేను, ఈ మాట మనం గుర్తు పెట్టుకోవాలి. ఒకసారి భగవాన్ తల్లితో రంగన్ అంటాడు, మీ అబ్బాయి బాగా సంపాందించుకొన్నాడు, మీ అబ్బాయి సంపాదించుకొన్న దానిలో నాకు కూడా కొద్దిగా వాటా పెట్టించు అని భగవాన్ తల్లితో అంటాడు. అప్పడు భగవాన్ తల్లి  భగవాన్‌తో వాడు చెప్పే మాటలు నీకు వినబడ్డాయా, నేను మరల చెప్పాలా అని అంది. వాడు చెప్పే మాటలు నాకు వినబడుతున్నాయి, నీవు మరల చెప్పనక్కరలేదు, మన సంపదలో వాడూ వాటాదారుడే, అడిగితే ఇచ్చినట్లు అడగకపోతే ఇవ్వనట్లుకాదు, వాడూ వాటాదారుడే అన్నారు భగవాన్. మన దగ్గర అమాయకత్వం ఎక్కడ ఉంది అంటే అడిగితే భగవంతుడు ఇస్తాడు, అడగకపోతే ఇవ్వడేమో అనుకొంటాము. అడిగిన వాడికి భగవంతుడు అడిగినదే ఇస్తాడు కాని అడగని వాడికి అన్నీ ఇస్తాడు, అన్నీ ఇచ్చి వూరుకోడు, మోక్షంకూడా ఇస్తాడు, నీ హృదయంలో ఒక సత్యం ఉంది, అదే అంతటా వ్యాపించి ఉంది. అది వేరు, ఇది వేరు అని మనం అనుకొంటున్నాము. ఆ వేరుభావన ఉన్నంతకాలం నిన్ను క్రోధం వెంటాడుతుంది, భయం వెంటాడుతుంది, కోరిక వెంటాడుతుంది. కోరిక, కోపం ఈ రెండు తాళ్ళు చేత జీవుడు శరీరానికి కట్టబడి ఉన్నాడు. అందుచేత ఈ శరీరం చనిపోయేటప్పడు జీవుడు ఏడుస్తాడు, ఎందుచేతనంటే మొక్కలు పెరగటానికి ఈ భూమి ఎలా ఆధారంగా ఉందో అలాగ కోరికలు నెరవేర్చుకోవటానికి, కోపతాపాలు ప్రదర్శించటానికి ఈ దేహం ఆధారంగా ఉంది, ఈ శరీరం విడిచిపెట్టాలని వాడికి ఉండదు. వాడి కోరికలు నెరవేర్చుకోవటానికి ఇది భూమి కింద ఉంది. మొక్కను భూమి నుండి లాగినప్పడు ఆమొక్క ఎంత బాధపడుతుందో శరీరాన్ని విడిచిపెట్టి జీవుడు బయటకు వెళ్ళేటప్పడు కూడా అంత బాధపడతాడు. ఆ బాధలో వాడికి దేవుని స్మరణ ఉండదు, ఏవో కొన్ని కోరికలు నెరవేర్చుకొన్నాము, ఇంకా నెరవేరని కోరికలు ఉన్నాయి అని ఏడుస్తూ, బాధపడుతూ చనిపోతాడు, మరల ఏడవటానికి కొత్త శరీరాలు వస్తాయి, అదే పునర్జన్మ. మనం చనిపోవాలి,



చనిపోవాలి అనుకోవటం లేదు కాని బతకాలి బతకాలి అనుకొంటున్నాము, అలా ఎందుకు అనుకోవటం లేదు, ఇలా ఎందుకు అనుకొంటున్నాము అని మీరు ఇంటికి వెళ్ళి ప్రశాంతంగా కూర్చొని ఆలోచించండి, మీకు సమాధానం దొరుకుతుంది, అజ్ఞానం యొక్కవేరు ఇక్కడే ఉంది. ఇదంతా నాలో ఉన్న కుట్ర, ఆకుట్ర అంతయూ కోసి నువ్వుసర్జరీ చెయ్యవయ్యా అరుణాచలేశ్వరుడా. కుట్ర అంతయు కోసి గుణముగా పాలించు అంటున్నారు. నువ్వు దేవుడిగానే కాదు, నాకు గురువుగాకూడా ఉండవయ్యా అంటున్నారు. అరుణాచలేశ్వరుడిని మనం దేవుడు, దేవుడు అనుకొంటున్నాము, ఆయన మనకు గురువు అన్న సంగతి మర్చిపోతున్నాము, ఆ ప్రవాహంలో కొట్టుకొని పోతున్నాము, ఆయన గురువులాగ మనకు సహాయం చేస్తాడు. అరుణాచలేశ్వరుడు ఎటువంటి గురువు అంటే ఆయన పాఠాలు చెపుతాడు, ఆమాట వెనకాల ప్రేమ ఉంటుంది, దయ ఉంటుంది, అనుగ్రహం ఉంటుంది. ఆ మాటలు నీకు అర్ధమయ్యేలాగ చేస్తాడు, వాటిని ఆచరించే  శక్తిని నీకు ప్రసాదిస్తాడు, అంతేకాదు ప్రతీ శ్వాసలో కూడా నిన్ను వెంటాడుతూ నీకు ఏదైతే గమ్యంగా ఉందో ఆహృదయంలోనికి నిన్ను నెట్టుకుని పోతాడు. బయటగురువు నిన్ను లోపలకు నెట్టుతాడు, లోపలగురువు నిన్ను గుంజుకొని ఆయన వడిలోనికి తీసుకొని ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు, ఓ అరుణాచలేశ్వరుడా! లోపల ఉన్నవాడవు, బయట ఉన్నవాడవు కూడా నీవే. మరల బయట ఉన్నవాడువేరు, లోపల ఉన్నవాడు వేరు అని నేను అనుకొంటే మాయలోపడతాను. గురువుయొక్కఅనుగ్రహానికి ఎవడైతేపాత్రుడయ్యాడో వాడి శరీరం చనిపోయి తిరిగివాడు ఎక్కడ పుట్టినా వాడికి స్వరూపసుఖం అందేవరకువాడు ఎక్కడ ఉన్నా గురువు విడిచిపెట్టడు. ఏ జన్మకు ఆజన్మ వాడిని కరెక్టు చేస్తూ ఉంటాడు, వాడు రాంగ్‌పాత్‌లో వెళుతూ ఉంటే వాడి మొఖాన్ని రైట్‌పాత్‌లోనికి త్రిప్పతూ ఉంటాడు, ఒక వేళవాడి మీద నువ్వుకోపం తెచ్చుకొన్నా ఆయన నీ మీదకోపం తెచ్చుకోడు. నువ్వు కోపం తెచ్చుకొన్నావని గురువుకూడా కోపం తెచ్చుకొంటే అది హ్యూమన్‌లవ్ అవుతుంది గాని డివైన్‌లవ్ అవ్వదు. గురువును నువ్వు ప్రేమించటంలేదు అని గురువుకు తెలుసు అయినా ఆయన నిన్ను ప్రేమించటం మానడు. ఈ ఒక్కవాక్యం మీ మనస్సులో పెట్టుకోండి మనం ఎవరిమోమనం తెలుసుకొంటే సుఖం, మనం ఎవరిమో మనకు తెలియకపోతే మనం ఎన్నిభోగాలమధ్యన  ఉన్న, మనకు ఎంత అధికారం ఉన్నా, ధనం ఎంత ఉన్నా కూడా మనలను దుఃఖం వెంటాడుతుంది, ఇప్పడు నీవు అనుభవించే భోగాలేరాబోయే జన్మలో రోగాల క్రింద వస్తాయి, పైగా ఈ భోగాలు చీకటి లోకాలకు తీసుకొని వెళతాయి, ఆత్మజ్ఞానం సంపాదించాలనే బుద్ధిని కలుగనివ్వవు, నీకళ్ళకు మైకం కప్పతుంది, మోక్షానికి ఇంకా ఫిట్ అవ్వకుండానే మోక్షం వచ్చేస్తుంది అనుకొంటాము. మీ రాంగ్‌తింకింగ్‌ను కనిపెట్టి, మీ కళ్ళకు ఉన్న పొరలకు సర్జరీచేసి, మీ చూపును, ఆలోచనావిధానాన్ని సరిచేస్తాడు, వాడు గురువు. మన మనస్సే మనలను శిక్షిస్తోంది అందుచేత మనస్సులో ఉన్న లోపాలు ఏమిటి, దానికి ఎటువంటి తలంపులు వస్తున్నాయి అని దానిని పరిశీలనలో పెట్టాలి. మాయ

అంతా మనస్సులో ఉంది, క్షోభ అంతా మనస్సులోనే ఉంది. దానిని పరిశీలించటం మానివేసి ఎంతసేపు ఆ చెట్టు చుట్టూ తిరుగుదాము, ఈ పుట్టచుట్టూ తిరుగుదాము, రోడ్డుమీద ఉన్న దుమ్ము అంతానొల్లుకొందాము అనుకొంటే ఎలాగ? అక్కరలేని తలంపులు పెట్టుకొని వ్యక్తిభావనను పెంచుకొంటూ జీవిస్తూ ఉంటే నీకు జ్ఞానం ఏమిటి? మీరు మనస్సును విశ్లేషణ చేసుకొంటూ, దానిని పరిశీలిస్తూ, మనస్సు ఏ కారణాల వలన బాహ్యముఖం అవుతోంది. ఆ కారణాలను తగ్గించుకొంటూ దానికి లోచూపునేర్పాలి. మనోమూలం మన హృదయంలోనే ఉంది. మనస్సును ఉపసంహరించి, అది ఇప్పుడు శిరస్సులో ఎంత సహజంగా ఉంటోందో అంత సహజంగా దాని మూలమైన హృదయంలో మనస్సు ఉండగలిగితే మనస్సు నశిస్తుంది, బ్రహ్మానుభవం కలుగుతుంది. మనోమూలాన్ని తెలుసుకొంటే నీవు మహర్షివి అవుతావు. మీరు అనవసరంగా వారు ఏమనుకొంటున్నారు, వీరు మన గురించి ఏమనుకొంటున్నారు అనే గొడవలలోనికి వెళ్లవద్దు. వారు ఎలా అనుకొన్నా, వీరు ఎలా అనుకొన్నా అదీ అహంకారమే, ఇదీ అహంకారమే. దీనినే ఆబ్జక్టివ్ థింకింగ్ అంటారు, ఆబ్జక్టివ్ థింకింగ్ ఉన్నవాడు ఎవడూ మహర్షి అవ్వలేడు. మన గురించి వారు ఏమనుకొంటున్నారు, వీరు ఏమనుకొంటున్నారు అంటే మీకు జ్ఞానంరాదు, మీ గురించి మీరు ఆలోచించుకోవటంవలన, మీలోని లోపాలు తెలుసుకొని వాటిని తొలగించుకోవటంవలన మీకు జ్ఞానం కలుగుతుంది. మన గురించి ఇతరులు ఏమనుకొంటున్నారు అంటే చివరకు అజ్ఞానం పెరుగుతుంది, బతికి ఉండగా దుఃఖం, చనిపోయిన తరువాత చీకటిలోకాలు మిగులుతాయి. ఓ అర్జునా! జ్ఞానమును సంపాదించు, జ్ఞానముతో సమానమైన వస్తువు ఏదీలేదు. సూర్యుడు ఉదయించగానే చీకటిలోఉన్న వస్తువులు కూడా మీకు ఎలా కనిపిస్తున్నాయో అలాగే నీకు జ్ఞానం కలిగాక నీ హృదయంలో ఉన్న బ్రహ్మం నీకు గోచరమవుతుంది, నీవు బ్రాహ్మీస్థితిని పొందుతావు అని భగవంతుడు చెప్పాడు.

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-12-03, భీమవరం**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సబ్జక్టు అనుభవంలో ఉండి చెప్పటంవేరు, ఏదో పుస్తకాలు చదివి చెప్పటంవేరు. నువ్వు ఏదైతే చెపుతున్నావో అది అయిఉండి చెపితే దానివలన ఇతరులకు వివేకం కలుగుతుంది, వారి చైతన్యస్థాయి పెరుగుతుంది. ఈ దేహం నేను అని ప్రతీ మానవుడు అనుకొంటున్నాడు. అయితే ఈ దేహం నువ్వా? ఈ దేహం నువ్వుకాదు అందుచేత మరణించినప్పుడు దేహంలో నుండి విడిపోతున్నావు. ఈ దేహమే కనుక నువ్వు అయితే అది ఎప్పుడూ నీకూడా ఉండాలి. ఎక్కడో మరణందాక ఎందుకు గాఢనిద్రలోనే ఈ దేహంతో నీకు సంబంధం లేదు. నిద్రపోయేవాడికి ఏ గొడవలేదు, దేనితోను వాడికి తాదాప్యం లేదు. మనకు డబ్బుఉందని భోగాలు పెంచుకోకూడదు. మనం రోజూ అన్నం తింటున్నాము. శరీరానికి రోగం వచ్చేలాగ తినకూడదు, ఆకలి తగ్గేలా తినాలి. మనం బట్టలు ఎందుకు కట్టుకొంటున్నాము ? శరీరాన్ని కప్పుకోవటానికి బట్టలు కట్టుకొంటున్నాము అంతకంటే



బట్టలప్రయోజనం ఏమీ లేదు. బట్టలు కొనుక్కోవచ్చు కాని డబ్బుఉందికదా అని 100 చీరలు కొనుక్కోవటం ఎందుకు? డబ్బు ఉందికదా అని 4 పూటలు తింటే ఎలాగ ? డబ్బును మంచి పనులకు ఉపయోగించాలి మనకు ధనం ఉంది అని కేవలము పొట్టకు, బట్టకు ఖర్చుపెడుతూ ఉంటే ఈ లోకంలో సుఖపడము, పరలోకంలో కూడా సుఖపడలేము. రమణమహర్షిగారికి గౌరవం మీద, కీర్తిమీద ఏదైనా కాంక్ష ఉందా అని ఒకసారి ప్లీడర్‌గారు అడిగారు. అసలు ఈ ప్రశ్న ఎందుకు అడుగుతున్నారు అని అడిగాను. రమణమహర్షి గొప్పవారు అని ఎవరైనా పేపరులో వ్రాస్తే ఆ పేపరు కటింగ్స్ లైబ్రేరీలో పెట్టమనేవారు కదా ఎందుకు అలా అనేవారు. అలాకాదు మన దేహాలు ఎప్పుడూ ఉండవుకదా, తరువాత తరాలవారు వచ్చి చూసుకొంటారు అని వాటిని లైబ్రేరీలో పెట్టమన్నారు. అంతమాత్రం చేత ఆయనకు కీర్తి మీద కాంక్ష ఉంది అని అనుకోనక్కరలేదు. ఇప్పుడు మనం డబ్బు సంపాదిస్తున్నాము, అంతా మనమే తినేయటంలేదు, వెనకాలవారిగురించి ఆలోచిస్తున్నాము కదా. రమణమహర్షిని పొగడటమేకాదు, విమర్శిస్తూ వ్రాసిన వారు కూడా ఉన్నారు. ఆయనను విమర్శిస్తూ వ్రాసిన పేపర్లు కూడా లైబ్రేరీలో పెట్టమనేవారు అది మీకు తెలియదేమో అని ఆ ప్లీడరుగారికి చెప్పాను. అసలు ఆయనకు సమానబుద్ధికనుక లేకపోతే ఆయన జ్ఞాని అవ్వలేడు. మమకారం నశించినవాడే మోక్షాన్ని పొందుతాడు. మీరు ఎవరి భక్తులైనా మమకారం నశించకుండా ఎవ్వరూ మోక్షాన్ని పొందలేరు. గురువు పట్ల రంధ్రాన్వేషణ పనికిరాదు. రమణమహర్షికి అసలు కీర్తికాంక్ష ఉందా అనే గొడవలు అనవసరం, అలా గురువుపట్ల రంధ్రాన్వేషణ పనికిరాదు. ప్రపంచం ఉన్నవాడికి కీర్తికాంక్ష ఉండవచ్చు, అసలు దేహమే లేనివాడికి, మనస్సే లేనివాడికి, ప్రపంచంలేనివాడికి కీర్తికాంక్ష ఏమిటి? జ్ఞానమార్గం గురించి రమణమహర్షి చెప్పినది ఎవరో వ్యాసం వ్రాసారు, ఆ పేపరు జాగ్రత్త పెట్టమన్నారు, అంతమాత్రంచేత ఆయనకు గౌరవం మీద కాంక్ష ఉంది అని అనుకోకూడదు, ఆ రకమైన ఆలోచనమంచిది కాదు అనిచెప్పాను. మనం కోరిక పెంచుకొంటూ వెళతాము అనుకోండి, ఉద్రేకం పెంచుకొంటూ వెళతాము అనుకోండి, మాటలో చేతలో ఇతరులను హింసిస్తూ ఉంటాము అనుకోండి మనం చనిపోయిన తరువాత చీకటిలోకాలు వస్తాయి. భక్తిలేనివారు భక్తిని తేలికగా చూస్తారు. మనం ఎంత కష్టపడితే, ఎన్ని జన్మలు సాధన చేస్తే ఈ భక్తి వచ్చిందో వారికి తెలియదు. భక్తి అంటే అంత తేలికగా లేదు. ఏదో గుడికి వెళ్లటం వలన భక్తివచ్చేయదు, మీరు పూర్వజన్మలలో సత్కర్మలు చేసి ఉంటారు, పెద్దలను సేవించి ఉంటారు, ఈశ్వరుని పాదాలను ఆశ్రయించి ఉంటారు. మీరు పూర్వజన్మలలో సత్కర్మలు చేసి ఉండకపోతే ఈ జన్మలో అసలు భక్తికలుగదు. మనం పూర్వజన్మలలో మంచిపనులు చేసి ఉంటాము కాబట్టి ఇప్పుడు రమణుడు గురించో, ఈశ్వరుడి గురించో మాట్లాడుకొంటున్నాము లేకపోతే ఆ బుద్ధి కూడా మనకు కలుగదు. పోరాటపటిమ ఉన్నవాడు రాజకీయరంగంలో అభివృద్ధిలోనికి వస్తాడు, సాధనా బలం ఉన్నవాడు ఆధ్యాత్మికరంగంలో అభివృద్ధిలోనికి వస్తాడు, భక్తుడికి సాధనాబలం